క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న రామచంద్రారెడ్డి, శాంతారావు

అల్లూరు (కొత్తపట్నం): విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విశ్రాంత వీఆర్వో, వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మదర్ సేవా సంస్థ ప్రతినిధి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.శాంతారావు శుక్రవారం ఉచితంగా పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పెన్నులు, ప్యాడ్లు, మొదలగు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గద్దలగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ

ఒంగోలు సబర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఒంగోలు నగరంలోని గద్దలగుంట వార్డు సచివాలయం పరిధిలో శనివారం నిర్వహిస్తున్నట్లు 32వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ తాడి కృష్ణలత తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక గద్దలగుంటలోని నెహ్రూ బొమ్మ సెంటర్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, అభిమానులు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

రేపు పంచాంగ రచనా రజతోత్సవం

ఒంగోలు: పంచాంగ రచన ప్రారంభించి 25 సంవత్సరాలైన సందర్భంగా ఆదివారం స్థానిక సంతపేట సాయిబాబా మందిర ప్రాంగణంలో పంచాంగ రచనా రజతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తేజస్వి జ్యోతిష్య వాస్తు వేద పరిశోధన కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ జూటూరి భానుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పంచాంగకర్తలు బుట్టె వీరభద్ర దైవజ్ఞ, కప్పగంతు సుబ్బరాజు సోమయాజులు, నేమాని సిద్ధాంతి, బీవీఎస్ సిద్ధాంతి, తంగిరాల సిద్ధాంతి, ఇంద్రగంటి ప్రసాద్‌శర్మ సిద్ధాంతి, లంకా శ్యామసుందర్ మొదలైన ప్రముఖ సిద్ధాంతులు, వేద పండితులు, జ్యోతిష్య వాస్తు పండితులు హాజరవుతున్నట్లు జూటూరి భానుమూర్తి పేర్కొన్నారు. వీరిని పురస్కారాలతో ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.

చీమకుర్తిలో దివ్యాంగుల బస్‌పాస్ మేళా నేడు

చీమకుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పొదిలి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జే సుందరరావు, కంట్రోలర్ పరాంకుశం శ్రీనివాసమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ పాస్ పొందిన వారితో పాటు ఎస్కార్ట్ వచ్చిన వ్యక్తి 50 శాతం రాయితీతో రానున్న మూడు సంవత్సరాల పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించవచ్చని తెలిపారు. బస్ పాస్ పొందడానికి ఆధార్ కార్డు జెరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో, సదరం సర్టిఫికెట్, రూ.100 నగదుతో మండల పరిషత్ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు: విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలులోని సమావేశం ఉన్నత పాఠశాల, జీవీఎస్ ఉన్నత పాఠశాల, దొనకొండ మండలం ఇందిరాగాంధీ ఓరియంటల్ ప్రాథమిక పాఠశాల, కనిగిరి మండలం ఏబీఎం ప్రాథమిక పాఠశాల, హెచ్‌ఎం పాడు మండలం ఈదరవారిపల్లి ప్రాథమిక పాఠశాల, కొమరోలు మండలం గోపనపల్లి ఏబీయం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, నల్లగుంట ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, గిద్దలూరు మండలం ఎస్‌పీజీ పాఠశాల, యర్రగొండపాలెం డీఎంబీసీ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు వారు నియమితులైన పాఠశాలల్లో విద్యార్థులు లేక ఇతర పాఠశాలల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారన్నారు. వీరందరికీ కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదలచేసి ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్న నినాదం ప్రతి ఇంటికీ వెళ్లాలి

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



సచివాలయ కన్వీనర్లు, నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: సమాజంలోని ప్రతిఒక్కరి సంక్షేమాన్ని తన బాధ్యతగా తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నినాదం జగనన్నే మా ధైర్యం ప్రతి ఇంటికి వెళ్లేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు చొరవ చూపాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మద్దిరాలపాడులోని వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గ్రామ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడారు. జగనన్నే మా ధైర్యం అనే నినాదంతో ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రతి సచివాలయ పరిధిలో కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమన్వయం చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అర్థమయ్యేలా వివరించాలన్నారు.

అలాగే మండలంలోని సచివాలయాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపై సమీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, నలమలపు కృష్ణారెడ్డి, మారెళ్ల బంగారుబాబు, మారెడ్డి సుబ్బారెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, కూనం పూర్ణచంద్రరావు, కుమ్మూరి సుధాకర్, పెనుబోతు రంగారావు, ఉప్పుగుండూరి శ్రీనివాస ప్రసాద్, పులిచర్ల పరంధామిరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మహిళలు ఎదగడానికే పాడి పరిశ్రమ

- కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి
- 9 పాలవెల్లువ కేంద్రాల ఎండీఎస్‌ఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



మహిళలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: మహిళలు పారిశ్రామికంగా ఎదగడానికి, జీవితంలో స్థిరపడటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న పాలవెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘాల బైలాలు, సెక్రటరీ విధులు, బాధ్యతలు, డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పి.సుజాత అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలంటే మహిళలు కీలకపాత్ర పోషించాలన్నారు. అందుకే జగనన్న పాలవెల్లువ కేంద్రాలను మహిళలకు సీఎం అప్పజెప్పారన్నారు. ఇప్పటి వరకు మహిళల డెయిరీ అసోసియేషన్ అనే పేరుపై ఉందని, దానికి చట్టబద్ధత తీసుకురావడానికి మహిళా డెయిరీ సహకార సంఘంగా పేరు మార్చుకుని రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని అన్నారు. మండలంలో 10 జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ఉంటే.. 9 కేంద్రాలు అర్హత సాధించాయని చెప్పారు. ఆ 9 కేంద్రాలను అడ్‌హాక్ కమిటీగా ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్నామన్నారు. సహకార సంఘం ఏర్పాటు చేసుకుని బలోపేతం కావడానికి తమ సహకారం, ప్రజాప్రతినిధుల సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. జగనన్న పాల వెల్లువ నోడల్ అధికారి, జిల్లా సహకార సంఘ అధికారి పి.రాజశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. మొదటిగా ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాలను మోడల్‌గా తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు డెయిరీలు 95 ఉంటే.. లీటర్ ధర రూ.58 ఇచ్చేవారని, జగనన్న పాలవెల్లువ కేంద్రాలు పెట్టిన తర్వాత వెన్నశాతాన్ని బట్టి రూ.84 ఇస్తున్నామని అన్నారు. జగనన్న పాలవెల్లువ డెయిరీలు ఇచ్చే ధరతో సమానంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాలు పోసే రైతులు 1,525 మంది ఉన్నారని, వారు పేర్లు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ మండలంలో 10 జగనన్న పాల వెల్లువ కేంద్రాలు నడుస్తున్నాయన్నారు. ప్రతిరోజూ రూ.2,200 లీటర్ల పాలు పోయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2వ స్థానంలో కొత్తపట్నం మండలం ఉండటానికి అందరి సహకారం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలను ఎంపీపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. చిన్న పంచాయతీ రంగాయపాలెంలో రోజుకు 900 లీటర్ల పాల సేకరణకు కృషి చేసిన సర్పంచ్ గాలి స్వరూపను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అర్చన, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్‌బేగం, పశువైద్యాధికారి ఆషా, జగనన్న పాల వెల్లువ అడ్‌హాక్ కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తీరప్రాంత అభివృద్ధిపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఏపీలోని తీర ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్లో ప్రశ్న లేవనెత్తారు. తీర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, సాధించిన ప్రగతి, రాష్ట్ర ప్రతిపాదనలు, విడుదల చేసిన నిధుల గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఆయన వివరణ కోరారు. దీనికి కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖామంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానమిస్తూ ఏపీతో పాటు దేశంలోని తీర ప్రాంతాల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రాజెక్టులను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వశాఖ గుర్తించిందన్నారు. ప్రస్తుత ఓడరేవుల ఆధునికీకరణ, నూతన ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలను మంత్రిత్వశాఖ గుర్తించిందన్నారు. ప్రస్తుత ఓడరేవుల ఆధునికీకరణ, నూతన ఓడరేవులు, పర్యాటక రక్షణ నిర్మాణాలు, అనుసంధానాలు మెరుగుపరచడం, లోతట్టు జల మార్గాలు, లైట్ హౌస్ పర్యాటకం, ఓడరేవుల చుట్టూ పారిశ్రామికీకరణ, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక కేంద్రాలు మొదలైన అంశాలకు చెందిన వివిధ ప్రాజెక్టులు, కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వశాఖలు, విభాగాలు నిర్వహిస్తాయన్నారు. తక్కువ ఖర్చుతో రవాణా, శక్తి-సమర్థత గల తీర ప్రాంత షిప్పింగ్ అభివృద్ధికి 2023-24 బడ్జెట్‌లో రూ.75 వేల కోట్ల పెట్టుబడులను కేంద్రం ప్రకటించిందన్నారు. బొగ్గు, ఉక్కు, ఎరువులు, ఆహార ధాన్యాల రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. దీనివల్ల తీరప్రాంతాలు సంపూర్ణ అభివృద్ధి చెందగలవన్నారు. ఏపీలో సాగర్‌మాల నిధులు, సాగర్‌మాల అభివృద్ధి కంపెనీ, పబ్లిక్ అండ్ ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టుల కింద రూ.1,736 కోట్లతో చేపట్టిన 24 ప్రాజెక్టులకుగానూ 11 పూర్తయ్యాయన్నారు. మిగతా 13 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఏపీ నుంచి రూ.3,300 కోట్ల విలువ గల 29 నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రూ.2,500 కోట్ల విలువ గల 14 ప్రాజెక్టులు ఆమోదించడం జరిగిందని అన్నారు. మంజూరు చేసిన రూ.450 కోట్లకుగానూ రూ.198 కోట్లు విడుదలయ్యాయన్నారు. అందులో రెండు రోడ్లు, రెండు మౌలిక సదుపాయాలు, 3 సాంకేతిక కేంద్రాలు, ఒక పోర్టు నవీకరణ, ఒక పర్యాటక రక్షణ నిర్మాణం, విశాఖ-జువ్వలదిన్నె-గుడుగట్లపాలెం-కొత్తపట్నం-పూడిమడక వద్ద 5 చేపల హార్బర్లు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వివరించారు.

ఘనంగా జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ పోటీలు

ఒంగోలు: జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ పోటీలను స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. క్రీడాజ్యోతి వెలిగించిన అనంతరం డైరెక్టర్ శిద్దా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని 5 జిల్లాల్లో గల 32 కాలేజీల నుంచి 800 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మహిళా విభాగంలో ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, పురుషుల విభాగంలో ఖోఖో, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలేజీ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ తెలిపారు. రైజ్ గ్రూప్ కార్యదర్శి శిద్దా హనుమంతరావు పాల్గొన్నారు.

రిటైరైన తహసీల్దార్‌కు ఘన సన్మానం



లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మద్దిపాడు: మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మీనారాయణ దంపతులను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండలంలో తహసీల్దార్‌గా ఒక ఏడాది 9 నెలలపాటు ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఎవరినీ నొప్పించకుండా అందరినీ కలుపుకుపోయి నిబద్ధతతో లక్ష్మీనారాయణ పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, పలువురు అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, డీటీలు, నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ద్వారా గృహాల నిర్మాణం




మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో 5 జగనన్న లే అవుట్లలో నేటికీ గృహాలు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న సాయంతో గృహాలు నిర్మించి ఇచ్చేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చినట్లు హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి తెలిపారు. సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన కార్యదర్శి పూర్ణచంద్రరావు కన్వీనర్‌గా కరవది గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 1, 2 సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు నిర్వహించిన ఈ సమావేశంలో డీఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు అనే పథకం ప్రవేశపెట్టిందని, కొందరు ముందుకొచ్చి గృహ నిర్మాణాలు ప్రారంభించడం, కొందరు అసంపూర్తిగా ఉంచడం, మరి కొందరు పూర్తిచేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఉన్న కొందరు నిరుపేదలు నేటికీ భూమి పూజ చేయకపోవడంతో కాంట్రాక్టర్ ద్వారా ప్రభుత్వం అందజేసిన డిజైన్ ప్రకారం నాణ్యంగా ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు ఒక కాంట్రాక్టరు ముందుకొచ్చారన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటికే భూమి పూజ చేయకుండా నిర్మాణాలు ప్రారంభించని వారి జాబితాను కార్యదర్శికి అందజేస్తే రెండు రోజుల్లోగా పనులు ప్రారంభిస్తారని తెలిపారు. పృథ్వీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమష్టిగా సర్వే నిర్వహించి నిరుపేదలను గుర్తించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి-2 వేమా శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మణికంఠ, రమీజ్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

15లోపు జగనన్న కాలనీల్లో గృహాలు పూర్తి చేయండి

- మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు



అధికారులతో సమీక్షిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న కాలనీ లే అవుట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారులు వారి గృహ నిర్మాణాలను ఈ నెల 15లోపు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్, ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని కమిషనర్ చాంబర్‌లో ఒంగోలు రూరల్ మండల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ పృథ్వీతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో తొలుత గ్రామాల వారీగా ప్రారంభించని, ప్రారంభించిన, పూర్తయిన గృహాలపై సమీక్షించారు. ప్రభుత్వం గొప్ప లక్ష్యంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించినా కొందరు లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మీనమేషాలు లెక్కించడంలో అర్థం లేదన్నారు. గుండాయపాలెంలో గృహాలు నిర్మించుకోలేని వారికి కాంట్రాక్టర్ ద్వారా ప్రభుత్వ డిజైన్ ప్రకారం ఇళ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేసి ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కరవదిలో కూడా నిర్మాణాలు చేపట్టని నిరుపేదలకు కాంట్రాక్టర్ ద్వారా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారని, కార్యదర్శి అందజేసిన జాబితా ప్రకారం రేపటి నుంచి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో అన్ని గ్రామాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఒంగోలు ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, విద్యుత్ ఏఈ చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, పీఆర్ ఏఈ శేషగిరి పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: సీపీఎం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు పిలుపునిచ్చారు. సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, తొట్టెంపూడి రామారావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మోటూరి ఉదయం స్ఫూర్తితో పోరాటాలు చేయాలి

ఒంగోలు టౌన్: సామాజిక సమస్యల పరిష్కారం, స్త్రీ పురుషుల సమానత్వం కోసం శ్రమించిన మోటూరి ఉదయం స్ఫూర్తితో మహిళల సమస్యలపై పోరాటాలకు ముందుకు రావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఎల్బీజీ భవన్‌లో శుక్రవారం మోటూరి ఉదయం 21వ వర్ధంతి నిర్వహించారు. మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు బి.గోవిందమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన మోటూరి.. ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఖ్యాతి సంపాదించారని తెలిపారు. సమాజంలో నెలకొన్న మూఢభావాలు, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని తెలిపారు. మోటూరు ఉదయం స్ఫూర్తితో ఒంగోలులో ఉదయం ట్రస్ట్ ఏర్పాటు చేసి మహిళలకు ఉచితంగా న్యాయసలహాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు రాజ్యలక్ష్మి, ఆళ్ల సీతామహాలక్ష్మి, జి.ఆదిలక్ష్మి, రాజేశ్వరి, కళ్యాణి, సీహెచ్ రమాదేవి, ఇంద్రజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మోటూరి ఉదయం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి



ఈతముక్కలలో పశువులకు టీకాలు వేస్తున్న ఏడీ బసవశంకరరావు



కొలచనకోటలో టీకాలు వేయడాన్ని పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి, డాక్టర్ మాధవి

ఈతముక్కల (కొత్తపట్నం): పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.బసవశంకరరావు సూచించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఈ నెల 24 నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తు టీకాలు వేస్తున్నామన్నారు. అందులో భాగంగా శుక్రవారం టీకాలపై ఆయన తనిఖీ చేశారు. ఎంత డోస్ వేస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని పశువులకు వేశారని ఆరా తీశారు. ఈతముక్కల, కొత్తపట్నం, అల్లూరు గ్రామాల్లో టీకాలు వేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పశుపోషకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, నోరు, గిట్టలలో పుండ్లు ఏర్పడటం, మేత, నీరు తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. చూడి పశువులైతే ఈసుకు పోవడం, పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం వంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. వ్యాధి సోకిన పశువుల వద్ద పాలు తాగితే దూడలు చనిపోవడం, ఎద్దు పనిచేసే సామర్థ్యం తగ్గడం, తదితర లక్షణాలతో బాధపడతాయన్నారు. దీని వలన పాడి రైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందన్నారు. అందువలన ప్రతి పశువుకు అశ్రద్ధ చేయకుండా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని సూచించారు. మండలంలో 319 తెల్ల పశువులు, 12,888 నల్ల పశువులు ఉన్నాయన్నారు. అందులో ఇప్పటికే 58 తెల్ల పశువులకు, 1,215 నల్ల పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈతముక్కల పశువైద్యాధికారి తుపాకుల అనూష, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో పరిశీలించిన జేడీ బేబీరాణి...

మద్దిపాడు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బేబీరాణి సూచించారు. మండలంలోని కొలచనకోట గ్రామంలో శుక్రవారం పశువైద్యశాఖ సిబ్బంది టీకాలు వేస్తుండగా, డెయిరీ ఫారంను జేడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 25 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకూ పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పశువైద్యశాఖ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట పశుసంవర్ధకశాఖ డాక్టర్ మాధవి, ఏడీ కార్యాలయ సిబ్బంది, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి సభకు ఎమ్మెల్యే టీజేఆర్‌కు ఆహ్వానం



ఎమ్మెల్యే టీజేఆర్‌ను ఆహ్వానిస్తున్న ఒంగోలు జైభీమ్ ఫౌండేషన్ నాయకులు

చీమకుర్తి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనాలని ఒంగోలు జైభీమ్ ఫౌండేషన్ నాయకులు శుక్రవారం సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును ఆహ్వానించారు. ఒంగోలులోని ఆయన కార్యాలయంలో ఆహ్వాన పత్రిక అందించారు. 13న నిర్వహించే ఆటల పోటీలు, 14న వెయ్యి మందితో నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం



ర్యాలీలో మాట్లాడుతున్న ఎల్-2 రాధా శింగమనేని

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతో పాటు ఆదాయం కూడా ఉంటుందని ఎల్-2 రాధా శింగమనేని రైతులకు తెలిపారు. శుక్రవారం ఉదయం మండలంలోని ఉలిచి గ్రామంలో రైతు సాధికారిక సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ విభాగం వారు ప్రీమ్యాన్ డే సోయింగ్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. 30 రకాల విత్తనాలతో ప్రీమ్యాన్ డ్రై సాయింగ్ చేసేటప్పుడు విత్తనాలను విత్తన గుళికలుగా చేసుకుని బీజామృతం, ఘనజీవామృతం, బంకమట్టి, బూడిదలో మూడు లేయర్లుగా విత్తనాలను విత్తన గుళికలుగా చేసుకోవాలన్నారు. ఇలా చేసుకున్న విత్తనాలను పొలంలో చల్లుకోవడం ద్వారా పొలంలో వర్షం పడిన వెంటనే మొలక రావడం జరుగుతుందన్నారు. ఇందులో కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి, నూనె గింజలు, పచ్చిరొట్ట జాతులు వేసుకోవాలన్నారు. ఈ విధంగా మొక్కలు వేయడం వలన పూర్తిగా ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం జరుగుతుందన్నారు. 45 రోజుల తర్వాత పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చన్నారు. కొన్నిసార్లు కలియదున్నడం వలన భూసారం పెరుగుతుందన్నారు. అంతేగాకుండా 365 రోజులు భూమిని కప్పి ఉంచడం రైతులకు చక్కని వరం లాంటిదని రాధా శింగమనేని అన్నారు. ఉలిచి గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రెడ్డప్ప, పద్మావతి, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

- ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ప్రతిఒక్కరూ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక సమతానగర్ సచివాలయం పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయ పరిధిలో ఆధార్ కార్డు సర్వీసెస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు తీసుకుని 10 సంవత్సరాలు పూర్తయిన ప్రతిఒక్కరూ వారి ఆధార్ కార్డులను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. నగరంలోని పలు వార్డు సచివాలయాల పరిధిలో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అప్‌డేట్‌తో పాటు కొత్త ఆధార్ కార్డులకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఆధార్ డ్రైవ్‌లో భాగంగా సుమారు 30 నుంచి 40 మంది వరకు ఆధార్ కార్డు సర్వీసెస్‌ను పొందుతున్నారన్నారు. నగరంలోని సమతానగర్ సచివాలయంతో పాటు పేర్నమిట్ట, ఎన్‌జీవో కాలనీ, ఇందిరానగర్ సచివాలయాల్లో కూడా ఆధార్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తన చాంబర్‌లో రెవెన్యూ విభాగం అధికారులతో పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఇంకా నగరంలో రూ.12 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. చివరి రోజు కావడంతో సచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పన్ను బకాయిల గురించి వివరించాలన్నారు. ఈ సందర్భంగా గోరంట్ల మల్టీప్లెక్స్ సినిమా హాలు యాజమాన్యం రూ.16 లక్షల పన్ను బకాయిలను నేరుగా కమిషనర్‌కు చెల్లించి రసీదు పొందింది. ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇచ్చినందున అందరూ బకాయిలు చెల్లించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. అనంతరం పేర్నమిట్ట వార్డు సచివాలయం పరిధిలో పర్యటించి పన్ను బకాయిలున్న వారి ఇళ్లకు వెళ్లి మరీ పన్ను బకాయిలు చెల్లించాలని కోరి కట్టించారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు.